# ఆంధ్రభూమి



## విజయవాడ

మంగళవారం, 29 జూలై 2014 పేజీలు : 8


### బెలారూస్ దేశంలో

# ఎంట్రన్స్, డొనేషన్లు లేకుండా వైద్యవిద్య

**ఆంధ్రభూమి బ్యూరో**

విజయవాడ, జూలై 28: భారతదేశంలో వైద్య విద్య కోసం ప్రవేశ పరీక్షలతో పాటు కోట్లాది రూపాయలను డొనేషన్ల రూపంలో చెల్లించాల్సి వస్తున్న తరుణంలో తూర్పు యూరప్‌లోని బెలారూస్ దేశంలోని ప్రభుత్వ వైద్య విశ్వవిద్యాలయాలు ఎలాంటి ఎంట్రన్స్, డొనేషన్లు లేకుండా నిర్ణీత ఫీజుతో ద్వారాలు తెరచాయి. ఆ దేశంలో ప్రపంచ ప్రఖ్యాత గోమెల్ మెడికల్ యూనివర్సిటీ, విటెస్క్ మెడికల్ వర్సిటీ, బెలారుషియన్ మెడికల్ వర్సిటీలు ప్రభుత్వపరంగా నడుస్తున్నాయని వీటన్నింటిలో 800 సీట్లు ఉండగా విటెస్క్ మెడికల్ వర్సిటీలో మొదటి సంవత్సరానికి 200 సీట్లు ఉన్నాయని ఆ యూనివర్సిటీ ప్రతినిధి అరెనా బెలియాకోవ తెలిపారు. మెడికో అబ్రాడ్ సంస్థ సహకారంతో సోమవారం నాడిక్కడ నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. డాక్టర్ కావాలనే లక్ష్యంతో సైన్స్ గ్రూపును ఎంచుకుని ఎంతో శ్రమపడి ప్రవేశ పరీక్షలు రాసినా పరిమిత సీట్లు, డొనేషన్ల భారంతో రాజీపడి ఇతర కోర్సుల్లో చేరిపోతున్నారన్నారు. ఉదాహరణకు రాష్ట్రంలో ఆరువేల మెడికల్ సీట్లు ఉంటే లక్షా 12వేల మంది ఎంసెట్ పరీక్ష రాసారన్నారు. ఇదే సమయంలో విదేశీ వైద్య విద్యకు ఇటీవల మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆమోదం తెలిపిందన్నారు. తూర్పు యూరప్ భాగంలో ఉన్న బెలారూస్ ఉక్రెయిన్, రష్యా దేశాల సరిహద్దులో ఉందని విదేశీ విద్యార్థులకు విద్యాభ్యాసానికి అవకాశం కల్పిస్తున్న దేశాల వరుసలో ఉందని అన్నారు. తమ విశ్వవిద్యాలయం లేబొరేటరీలు, అత్యాధునిక వైద్య పరికరాలు, ఆసుపత్రులు, ఉత్తమ బోధన ప్రమాణాలున్నాయని అన్నారు. ఇంటర్ విద్యార్హత ఆధారంగా ఎలాంటి ప్రవేశ పరీక్ష లేకుండా 50 శాతం ఉత్తీర్ణతతో ఇక్కడ సీటు పొందవచ్చన్నారు. ఆరేళ్ల కోర్సులో 12సెమిస్టర్లు ఉంటాయని, ప్రతి సెమిస్టర్‌కు లక్షా 20వేలు ఫీజు రూపంలో చెల్లించాల్సి ఉందన్నారు. మెడికో అబ్రాడ్ మేనేజింగ్ పార్టనర్ వి రాజారామ్ మాట్లాడుతూ ప్లానింగ్ కమిషన్ నివేదిక ప్రకారం భారతదేశానికి ఇంకా ఆరు లక్షల మంది వైద్యులు అవసరమని విదేశీ వైద్య విద్యతో డాక్టర్ కావాలనే కలను విద్యార్థులు నిజం చేసుకోవచ్చన్నారు.



**వివరాలు తెలుపుతున్న యూనివర్సిటీ ప్రతినిధి అరెనా బెలియాకోవ**